# మూడవ దృశ్యం

- భాగవతుల లలితశర్మ

అందంగా అలంకరించుకొని ఒద్దికగా ఓవార కూర్చున్న కొత్తపెళ్లి కూతుర్లా వుంది ఆ చిన్ని భవనం. లేత ఆకుపచ్చ ప్రహరీగోడ....ముద్దొచ్చే చిన్నగేటు! లోపలికడుగు పెట్టగానే చిరునవ్వులు చిందిస్తూ పల్కరించే గులాబి మొక్కలు- దారి కిరుప్రక్కలా. ఒకవేపు రాధాకృష్ణుల పాలరాతి విగ్రహం. మరొకవేపు పచ్చటి తివాసీ పరిచినట్టున్న లాన్! ఆ లాన్ మెత్తదనానికే కందిపోతాయేమోనన్నట్టూ-అతి సున్నితంగా పాదాలను కదుపుతూ అటూ ఇటూ పరికిస్తూ పూల అందాలను ఆస్వాదిస్తూన్న సన్నజాజి మొగ్గలాంటి ఓ ముద్దుగుమ్మ!

సతీష్ రూం లో కుడి వేపు కిటికీ తలుపులు తెరవగానే నాకు కనిపించిన సుందర దృశ్యం ఇది. సతీష్ నా భుజం మీద చెయ్యి వేసి, ''బావుంది కదూ!'' అన్నాడు.

''అదృష్టవంతుడివి. ఏమీ తోచనప్పుడు, ఈ కిటికీ ఎదుట నిల్చుంటే-గంటలు క్షణాల్లా గడిచిపోతాయి!'' అన్నాను.

''ఆ కిటికీ కూడా తీసి చూడు-ఇంకా బావుంటుంది.'' అన్నాడు. సతీష్ ఎడమవేపునున్న కిటికీ చూపిస్తూ. ఆ కిటికీ కూడా తెరిచాను వెంటనే.

ఆర్టిస్టిక్‌గా కట్ చెయ్యబడిన కేకు ముక్కలాగా -ముచ్చటైన కలర్ కాంబినేషన్‌తో అత్యాధునికంగా కట్టబడింది ఆ యిల్లు. ఇంటిముందొక చక్కటి గార్డెన్. గార్డెన్‌లో ఒకవేపు పూలమొక్కల మధ్య ఒక ఫౌంటెన్. మరొక వేపు పచ్చటి వెల్వెటులా లేఎండలో మెరుస్తూన్న లాన్. లాన్‌లో ఒక కార్నర్‌లో సోఫా వుయ్యాల! ఆ వుయ్యాలలో సుతారంగా ఊగుతూ ఓ అందమైన యువకుడు. అతని భుజం మీద తలవాల్చి 'స్వీట్ నథింగ్స్' చెప్పుకుంటూ లావణ్యాన్ని ఒలకబోస్తున్న ఓ అందాలరాశి. ఆమె నానుకొని కూర్చున్న 'చెంగల్వపూదండ' లాంటి మూడేళ్ల చిన్నారి. ఆ చిన్నారి మెత్తటి ఒడిలో, ''ఋణానుబంధ రూపేణా...'' అన్నట్టూ ఏ జన్మలో చేసుకున్న అదృష్టాన్నో అనుభవిస్తూన్న ఓ తెల్లటి బొచ్చుకుక్క.

''చాలురా! అట్టే చూడకు-దిష్టి తగలగలదు!'' అన్నాడు సతీష్ నవ్వుతూ నన్ను వెనక్కిలాగి.

నేను బలవంతంగా దృష్టి మరల్చుకుంటూ, ''ఏదో సినిమా చూస్తున్నట్టూ వుంది ఆ దృశ్యం'' అన్నాను ఇటు తిరిగి. ''ఆ మూడో కిటికీ తెరుస్తే.....'' అంటూ అటు వెళ్లబోయిన నన్ను వారిస్తూ, ''అక్కడ మనల్ని సంతోషపెట్టే సుందరదృశ్యాలేవీ కనబడవులే'' అన్నాడు సీరియస్‌గా.

''ఓహో-చెత్తలూ గట్రా పారబోస్తారు కాబోలు అటువేపు'' అంటూ వచ్చి సతీష్‌కి ఎదురుగానున్న కుర్చీలో కూర్చున్నాను.

ఆ కిటికీల్లోని దృశ్యాలు రెండూ నా మనసుని బాగా ఆక్రమించుకున్నాయి. ''అదృష్టవంతులు-రెండు చేతులా ఆర్జిస్తున్నారు కాబోలు...మనమూ వున్నాం! ఏదో...దొరికిన ఉద్యోగాల్లో స్థిరపడిపోయి...ఎలాగో బ్రతికేస్తూ...''నా గొంతులోని అసంతృప్తికి చురుక్కుమని చూశాడు సతీష్.

''ఆ...చదివించేవాళ్లుంటే....మనమూ బాగా చదువుకొని పైకి వచ్చేవాళ్లమే! ఉన్నంతలో తృప్తిగా బ్రతకటం నేర్చుకోవాలి. మరొకళ్లతో పోల్చి చూసుకొని బాధ పడ్డం ఎందుకూ?'' అన్నాడు.

''రైటేలే-లేని దానికి బాధపడి లాభం ఏమిటి? అన్నట్టూ.....హైస్కూలు వదిలేశాక మనం మళ్లీ కలుసుకోవడం ఇదే కదూ!'' అన్నాను మాట మారుస్తూ.

''ఔను. అనుకోకుండా ఇవాళ నువ్వు కలవడం చాలా ఆశ్చర్యంగా వుంది. ఓ ఫ్రెండ్‌ని దిగబెడదామని నేను రైల్వే స్టేషన్‌కి రావడం- అదే ట్రెయిన్‌లో నువ్వు దిగడం...అంతా మోస్ట్ డ్రమెటిగ్గా జరిగింది కదూ!'' అన్నాడు సతీష్ మొహం నిండా ఆనందం నింపుకొని.

''నువ్వీ వూళ్లో ఉన్నట్టే నాకు తెలీదు! నేనేదో ఆఫీస్ పనిమీద వచ్చేను. అన్నట్టూ...మన వేదనిధి మాస్టారు ఈ వూళ్లోనే వున్నారని విన్నాను నిజమేనా?'' అన్నాను ఆత్రుతగా.

''ఔను. ఇక్కడే వున్నారు.'' అన్నాడు సతీష్.

''నువ్వెప్పుడేనా కలిసేవా ఆయన్ను? ఒకసారి వెళ్దాం. నాకు చాలా చూడాలని వుంది.''

''నీకేదో ఆఫీసుపని వుందన్నావుగా. ముందు దాని సంగతి కానియ్యి. రేపు సాయంత్రం వెళ్దాంలే ఆయనదగ్గరికి.''

''ఆయనకి ఇద్దరబ్బాయిలు కదురా? ఎలా వున్నారో వాళ్లంతా! మేష్టారు బాగా పెద్దవారయిపోయి వుంటారు కదూ?''

సతీష్ అదోలా నవ్వాడు. నా ఆత్రుత చూసి కాబోలు.


''పద. హోటల్‌కి వెళ్లి భోజనం చేసి వద్దాం'' అన్నాడు లేచి నిల్చొని.

మర్నాడు ఉదయం నేను ఆఫీసు పని చూసుకొని వచ్చేసరికి సతీష్ నా కోసం ఎదురుచూస్తూ -రూంలోనే వున్నాడు.

ఆరోజు శలవు పెట్టాడు నాకోసం.

భోజనాలు కానిచ్చి రూం కొచ్చి, తీరిగ్గా కబుర్లలోకి దిగాం.

నేను బలవంతంగా దృష్టి మరల్చు కుంటూ, ''ఏదో సినిమా చూస్తున్న ట్టూ వుంది ఆ దృశ్యం'' అన్నాను ఇటు తిరిగి. ''ఆ మూడో కిటికీ తెరుస్తే.....'' అంటూ అటు వెళ్లబోయిన నన్ను వారిస్తూ, ''అక్కడ మనల్ని సంతోషపెట్టే సుందర దృశ్యాలేవీ కనబడవులే'' అన్నాడు సీరియస్‌గా.



మాటల మధ్య ''నువ్వింకా బ్రహ్మచారిగా వుండి పోయావేం? మనిద్దరం ఒక వయస్సు వాళ్లమే కదా. కొన్ని నెలల్లో నేను తండ్రిని కూడా కాబోతున్నాను.'' అన్నాను చిన్నగా నవ్వుతూ.

సతీష్ నావేపు కొంటెగా చూశాడు. ''నా పెళ్లికి నీవు పుత్రరత్నంతో సహా వద్దూగానిలే'' అన్నాడు.

''హాస్యంకాదు సతీష్. నేను నిజంగానే అడుగుతున్నాను. నీకు నచ్చిన అమ్మాయి ఇంకా తారసపడలేదా?'' అన్నాను కాస్త సీరియస్‌గా.

''అమ్మాయిలకేం కొదవ? ఐనా అమ్మాయి నచ్చకపోవడం కాదుగా అసలు సమస్య!'' అన్నాడు చిన్నగా నిట్టూర్చి. మళ్లీ తనే అన్నాడు కొన్నిక్షణాల తరువాత ''మా నాన్న సంగతి నీకు తెలీదు. డబ్బు విషయంలో మహాజాగ్రత్త! ఉన్నదంతా పిల్లలకి ఇప్పుడు ఊడ్చిపెట్టేస్తే-రేపు నా గతేంకాదు? అంటారు. ఎవరి సంపాదన వాళ్లకుండాలి. ఆర్థికంగా ఎవరూ, ఎవరిమీద ఆధారపడకూడదన్నది ఆయన అభిప్రాయం. అంచేత నేను ఉద్యోగంలో బాగా పైకొచ్చి నాలుగు డబ్బులు వెనకేసుకున్నాకే పెళ్లి గురించిన ఆలోచన. నీ సంగతి వేరు. నాలాగా నీకు అక్కచెల్లెళ్లు లేరుకదా. ఒక్కగానొక్క బిడ్డవి. ఆయనకున్నదంతా నీకేగా.''

''అక్కడే నువ్వు పొరపాటు పడ్తున్నావు. డబ్బు విషయానికొస్తే మా నాన్నగారి అభిప్రాయం కూడా అంతే. ఉన్నదంతా పిల్లలకు పెట్టేస్తే వృద్ధాప్యంలో మళ్లీ ఆర్థికంగా వాళ్లమీదే ఆధారపడాలి. మనం బతికినంత కాలం దర్జాగా బతకాలి. మన తదనంతరం, మిగిలిన దేదో వాడికేగా! అంటారు మా అమ్మతో'' అన్నాను కాస్త ఆవేశంగా.

సతీష్ నా మాటలకి చిన్నగా నవ్వి ఊరుకున్నాడు.


''సతీష్, నిన్నటి విషయం మళ్లీ నీ ముందుకి తెస్తున్నందుకు నన్ను తిట్టుకోకు! మనం కూడా డాక్టర్లో, ఇంజనీర్లో అయి రెండు చేతులా ఆర్జించే మనుకో-మన తల్లిదండ్రుల్ని వృద్ధాప్యంలో ఆదుకొని, ఆదరించమా? అంతస్వార్థపరులమైపోతామంటావా? ఇవన్నీ అర్థంలేని భయాలుకాని..''


''నేను ముందు నీలాగే అనుకున్నాను గాని- వాళ్ల భయాలు అర్థం లేనివి మాత్రం కాదు. నువ్వు బాగా ఆలోచించు. మన తల్లిదండ్రుల పట్ల మనకి స్వార్థం లేకపోవచ్చు. కాని మన భార్యలకి స్వార్థం వుండదని గ్యారంటీ ఏముంది? అటు, కట్టుకున్న పెళ్లాన్ని తృప్తి పరచలేక, ఇటు కన్నవారిని బాధపెట్టలేక సతమత మవయి, ఆఖరికి చేసేది లేక మనం కూడా మనకి తెలియకుండానే మారిపోతాము. 'నా సంసారం, నా పిల్లలు' అన్న తాపత్రంలో పడి మనిషి స్వార్థపరు డవడం అన్నది అతి సహజమైన విషయం.''

''ఔను. పెళ్లయాక కొడుకులు ఎక్కడ మారిపోతారో నన్న భయంతో వాళ్ళకి ఇంట్రెస్టు వున్నప్పటికీ పెద్ద చదువులు చెప్పించకపోవడం, ఉన్న డబ్బుని జాగ్రత్తగా బేంక్‌లో వేసుకోవడం, ఇది వాళ్ల స్వార్థం కాదా?''

''ఏమో. దాన్ని స్వార్థం అనే కన్న-ముందు జాగ్రత్త అనుకోవచ్చుగా. వాళ్లదగ్గరేం లక్షలు మూల గడం లేదు కదా!''

''నువ్వింకేమీ చెప్పకు సతీష్! మన వేదనిధి మాష్టారు మాత్రం లక్షాధికారా? మధ్య తరగతికి చెందిన ఒక బడిపంతులు! వాళ్లిద్దరి అబ్బాయి




లూ-ఒకళ్ళు డ్యాక్టర్, ఒకళ్ళు ఇంజనీర్ అని విన్నాను. వాళ్లకి ఒక పైసా కట్నం తీసుకోకుండా పెళ్లిళ్లు చేసారట. చిన్నప్పుడు ఆయన మనకి క్లాసులో పాఠాలతోపాటు ఏం బోధించేవారో మర్చిపోయావా?''

''ఎలా మర్చిపోతాను? 'అబ్బాయిలూ! మీరు పెద్దయ్యాక కట్నాలకి అమ్ముడుపోయి మీ వ్యక్తిత్వాలను చంపుకోకండి! అమ్మాయిలూ! డబ్బిచ్చి భర్తలను కొనుక్కోకండమ్మా!' అంటూ చెప్పేవారు. చెప్పడమే కాదు. తాను నమ్మిన ఆదర్శాన్ని అక్షరాలా ఆచరణలో పెట్టి చూపించేరు కూడా. తన కొడుకులిద్దరకూ అస్సలు కట్నం తీసుకోకుండానే పెళ్లిళ్లు చేశారు కదూ!''

''ఔను! అంతవరకు బాగానే వుంది...కాని...''

''కాని..అంటూ అడ్డుపుల్లలు వెయ్యడం కాదు. ఇది చాలా గొప్పవిషయం! నువ్వు ఒప్పుకు తీరవల్సిందే! అబ్బాయిల చదువులూ, హోదాలనీ బట్టి లక్షలు కట్నం రాబట్టే యీరోజుల్లో మాష్టారి లాంటి వాళ్లు చాలా అరుదు. అంత గొప్ప వ్యక్తిత్వం గల మాష్టారికి ఎన్ని సన్మానాలు చేస్తే సరిపోతుంది? ఎలాంటి అవార్డులు అందించాలి?'' ఆవేశంలో అరుస్తూన్న నన్ను జాలిగా చూశాడు సతీష్.

''ఎందుకలా చూస్తావు? ఆయన గొప్పదనాన్ని కనీసం మెచ్చుకోడానికి కూడా నోరురాదా నీకు?'' అన్నాను చిరాగ్గా చూస్తూ.

సతీష్ ఏదో అనబోయి. తల అడ్డంగా తిప్పి, మొహం దించుకున్నాడు. కాసేపు ఇద్దరం మౌనంగా వుండిపోయాము.

'ఛ..ఇన్నాళ్లకు కలుసుకున్నాం ....సరదాగా మాట్లాడుకోవడం మొదలుపెట్టి వాదనలోకి దిగిపోయాను. సతీష్ ఏమనుకొంటున్నాడో-నేను అంత కోపంగా అరిచినందుకు' అనిపించింది. సతీష్ వేపు చూశాను. తలపైకెత్తి సీలింగ్ వేపు చూస్తూ

ఏదో ఆలోచిస్తున్నాడు సతీష్.

నేను లేచి సతీష్ పక్కగా నిల్చుని -''సారీ సతీష్..నువ్వు అలా మౌనంగా కూర్చుంటే నేను భరించలేకపోతున్నాను. ఇన్నాళ్లకి కలుసుకున్నాం. ఏదైనా మాట్లాడు!''అన్నాను సతీష్ భుజం మీద చెయ్యివేసి.

సతీష్ చిన్నగా నిట్టూర్చి-వెంటనే మొహంలోకి చిరునవ్వు తెచ్చుకొని-నా చేతిమీద తన చెయ్యి వేసి అభిమానంగా నొక్కాడు. నేను తేలికగా ఊపిరి పీల్చుకొని-వెళ్ళి నా కుర్చీలో కూర్చున్నాను.

సతీష్ నా మొహంలోకి సూటిగా చూస్తూ, ''ఇంతకీ నీ ఆవేశం పూర్తిగా చల్లారినట్టేనా?'' అన్నాడు.

''అబ్బే! అదేం లేదు-చెప్పు!'' అన్నాను హాయిగా నవ్వుతూ.

సతీష్ గొంతు గంభీరంగా మారిపోయింది. ''నీకు వేదనిధి మాష్టారి గురించి పూర్తిగా చెప్పాలి.'' అన్నాడు సీరియస్‌గా చూస్తూ.

''చెప్పు!'' అన్నాను ఆత్రుతగా.


''నిన్న నువ్వు యీ రెండు కిటికీల్లోంచీ చూసి ఆనందించి, ఈర్ష్య పడ్డ రెండు భవనాలూ ఎవరివనుకుంటున్నావు. మాష్టారి ఇద్దరు సుపుత్రులవీ! నీకు తెలుసుగా-మాష్టారి భార్య ఆ పిల్లల చిన్నప్పుడే చనిపోయారని! తల్లీతండ్రీ రెండూ తానే అయి వాళ్లని ఎంతో జాగ్రత్తగా పెంచి పెద్దచేశారు. తనకున్నదంతా వూడ్చి, వాళ్లకి చదువులు చెప్పించారు. కొడుకులిద్దరూ వృద్ధాప్యంలో తమని ఆదుకుంటారనీ, ఆదరిస్తారనే నమ్మకంతో తనకూ అంటూ ఏమీ మిగుల్చుకోకుండా అంతా కొడుకులకే ఖర్చు చేశారు. అదే ఆయన చేసిన పెద్ద పొరపాటు! ఇప్పుడు దాని పర్యవసానం ఏమిటో తెలుసా? ఆయన ఆదర్శానికీ, నిస్వార్ధతకూ సన్మానాలూ, అవార్డుల మాట అటుంచీ, ఈరోజు ఆయన పరిస్థితి ఏమిటో నీ కళ్లతోనే చూద్దువుగాని ఇటురా!'' అంటూ సతీష్ గబుక్కున లేచి ఆ గదికి మూడవ వేపునున్న కిటికీ తలుపులు తెరిచాడు. ''అటు చూడు!'' అంటూ వెనకనే నిల్చున్న నన్ను ముందుకి లాగాడు.

నేను ఆత్రుతగా, అయోమయంగా కిటికీ లోంచి బయటికి చూశాను. రోడ్డు కవతల దూరంగా ఓ పెద్ద భవనం!

''ఏమిటది? ఎవరిదా బిల్డింగ్'' అన్నాను ఏమీ అర్ధం కాక.

సతీష్ గద్గద స్వరంతో చెప్పాడు, ''ఆ బిల్డింగ్ లోనే ప్రస్తుతం వేదనిధి మాష్టారు వుంటూన్నది...అది ఒక అనాధాశ్రమం!''

★



## ఇదేం కాపురం?

*దాదాపు రెండేళ్ల క్రితం అమెరికాలో సెటిలైన ఓ భారతీయుడ్ని వివాహం చేసుకున్న మీనాక్షి శేషాద్రి ఈమధ్య కాలంలో తెరమరుగైందనే చెప్పాలి. అయితే తాను సినిమాలకు గుడ్‌బై చెప్పలేదంటోంది. 'అమెరికాలో ఆయన వ్యాపారంతో అక్కడ ఆయన బిజీ, ఇండియాలో నా సినిమాలు, నృత్య ప్రదర్శనలతో నేను బిజీ. ఏడాదిలో రెండు మూడు సార్లు నేను వెళ్లొస్తాను. ఇంతకంటే మాకేం కావాలి' అంటోంది మీనాక్షి. ఆమాత్రం దానికి ఇంక పెళ్లెందుకు? అని ముక్కున వేలేసుకుంటున్న వారిని చూసి మీనాక్షి- నా గురించి ఎవరేం అనుకున్నా నేనేం పట్టించుకోను. అలాగే నా భర్త కూడా. నిజంగా శ్రీవారంటే మావారే' అంటోంది. అన్నట్టు త్వరలో దర్శకత్వం కూడా నిర్వహించబోతోందట.*

-జె.ఎం.